# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 294
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
సెప్టెంబర్ 03, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ఇంకుడు గుంతలను త్వరగా పూర్తి చేయాలి



8లో..

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- మోడల్ స్కూల్ అభివృద్ధి పనుల క్షేత్రస్థాయి పరిశీలన



# మేడారానికి.. మాస్టర్ ప్లాన్

- రూ. 236.20 కోట్లతో అమలు
- కుంభమేళాలు నిర్వహించిన సంస్థలతో రూపకల్పన
- జాతరలో పటిష్టంగా శాశ్వత నిర్మాణాలు
- సచివాలయంలో సమీక్షించిన మంత్రులు సురేఖ, సీతక్క, అడ్లూరి
- వన దేవతల ఖ్యాతి ఖండాంతరాలు దాటాలంటూ ఉద్బోధ
- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అంటూ కితాబు

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సమ్మక్క-సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటేలా రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. అంగరంగ వైభవంగా రెండు కుంభమేళాలు నిర్వహించిన సంస్థలతో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారంలో భక్తుల సౌకర్యార్థం జాతర పరిసరాల్లో పటిష్టంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టేలా పథకం రూపొందిస్తున్నారు. ఇందుకు గాను రూ.236.20 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.58.20 కోట్లతో గద్దెలను అభివృద్ధి చేయడంతోపాటు రూ.39 కోట్లతో జంపన్నవాగు అభివృద్ధి, రూ.50 కోట్లతో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పణకు, రూ.52.50 కోట్లు రహదారుల అభివృద్ధికి, రూ. 6.80 కోట్లతో గద్దెల వద్ద కళాకృతి పనుల కోసం కేటాయించనున్నారు. మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం వెచ్చించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఇతర ఉన్నతాధికారులు, పలు విభాగాల ఇంజనీర్లు హాజరయ్యారు.

-వరంగల్ వాయిస్, ములుగు





వివరాలు2లో..



8లో..

## తెలంగాణ అమరుల ఆత్మ ఘోషే..
## కవిత తిరుగుబాటు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



2లో..

## రెండో రోజుకు చేరిన..
## జాతీయ సమైక్యత శిబిరం

- సంస్కృతిని అర్థం చేసుకోవడమే లక్ష్యం
- గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు నింబాల్కర్



## నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు
## 36 గంటలపాటు అమలులో..

- నిమజ్జనం సందర్భంగా వాహనాల దారి మళ్లింపు

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా 36 గంటలపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నగరంలో పెద్ద ఎత్తున శోభాయాత్రలు నిర్వహిస్తూ నిమజ్జనానికి విగ్రహాలను తరలించే మార్గాల్లో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకుగాను ట్రై సిటి పరిధిలో వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలనుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు కోనసాగుతాయని ప్రకటించారు.

# మేడారానికి మాస్టర్ ప్లాన్..



- రూ. 236.20 కోట్లతో అమలు
- కుంభమేళాలు నిర్వహించిన సంస్థలతో రూపకల్పన
- జాతరలో పటిష్టంగా శాశ్వత నిర్మాణాలు
- సచివాలయంలో సమీక్షించిన మంత్రులు సురేఖ, సీతక్క, అడ్లూరి
- వన దేవతల ఖ్యాతి ఖండాంతరాలు దాటాలంటూ ఉద్బోధ
- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అంటూ కితాబు

**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సమ్మక్క–సారక్క జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి
అనసూయ సీతక్క, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్ రూంలో మేడారం మాస్టర్ ప్లాన్ పై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, ములుగు కలెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. పలుమార్లు కుంభమేళలు నిర్వహించిన సంస్థకు మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్టు అధికారులు మంత్రులకు వివరించారు.

### ప్రత్యేక డిజైన్..

సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణ నూతన డిజైన్ ను మంత్రులు ప్రత్యేకంగా పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై మంత్రులు సూచనలు చేశారు. సమ్మక్క సారలమ్మ పూజారులతో చర్చించి వారి అభిప్రాయం మేరకు ఆధునీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారి గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా.. తగిన మేరకు డిజైన్లు మార్చాలన్నారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుందని మంత్రులు చెప్పారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### రూ.236.20 కోట్లు..

రూ.236.20 కోట్లతో మేడారం జాతరలో మాస్టర్ ప్లాన్ అమలుకు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పనుల వారీగా కేటాయింపులు చేశారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల అభివృద్ధికి రూ. 58.20 కోట్లు, గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ. 6.80 కోట్లు, జంపన్న వాగు అభివృద్ధికి రూ. 39 కోట్లు, భక్తుల సౌకర్యార్థం రూ. 50 కోట్లు, రహదారుల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5 కోట్లతోపాటు అవసర నిమిత్తం ఇతరత్రా ఖర్చులు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి.. ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ముందుకు వెళతామన్నారు. మేడారం అభివృద్ధి ప్రతి దశలో పూజారులను భాగస్వామ్యం చేస్తామన్నారు.

### మహా జాతరకు రూ.150 కోట్లు..

2026లో నిర్వహించనున్న మేడారం మహా జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించినట్లు మంత్రులు గుర్తు చేశారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మక్క సారలమ్మ సేవ కోసం జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలన్నారు.

### పటిష్ట ఏర్పాట్లు..

సమ్మక్క సారలమ్మల త్యాగాన్ని ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పే విధంగా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తుందని మంత్రులు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చే వారి కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు పట్టిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగితే మేడారం జాతర మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వెహికల్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా డిజైన్లు రూపకల్పన చేయాలన్నారు. ప్యూరిఫైడ్ వాటర్ అందించాలని మంత్రి సురేఖ సూచించారు. బెల్లం కింద పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి సలహానిచ్చారు. బ్యాటరీ వెహికల్స్ ను వినియోగించుకోవాలన్నారు. క్రౌడ్ మేనేజ్ మెంటుకి ఏఐ ఎనబుల్డ్ కెమెరాలను ఉపయోగించాలన్నారు. సేవా పద్ధతిన భక్తులను మ్యాన్ పవర్ కింది వినియోగించుకోవాలన్నారు. వనదేవతలు వచ్చే దారిలో ఉన్న టెంపుల్స్ ను కూడా అవసరమైన మేరకు అలంకరణ చేయాలన్నారు. ఈ క్రమంలో భక్తులు ఆయా టెంపుల్‌లను దర్శించుకుంటారని మంత్రి సురేఖ చెప్పారు.



### పక్కా ప్లాన్ తో ముందుకు..

జాతరకు వెళ్ళే దారిలో ఇందిరా మహిళా క్యాంటీలను ఏర్పాటు చేసి తినుబండారాలు అందే విధంగా చూడాలన్నారు. అవసరమైతే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను వివిధ ప్రదేశాల్లో ఉపయోగించుకొని భక్తులకు తగు సేవలు అందజేయాలన్నారు. జాతర విజయవంతం అయ్యే అంశం రహదారులపై ఆధారపడి ఉంటుందని.. అందుకే, మేడారం – ఊరట్టం, మేడారం – కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్న వివరాలు మంత్రులకు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో అవసరమైతే మరొకసారి రివ్యూ చేయాలని మంత్రులు నిర్ణయించారు. సమ్మక్క, సారక్క అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పూర్వం నుంచి చోటుచేసుకున్న మార్పులు, పూజారుల ప్రమేయం, అంగీకారంతోనే చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని.. మాస్టర్ ప్లాన్ లో భాగంగా దాన్ని క్రమబద్ధీకరించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబర్ వరకు ఎంతమేరకు పనులు పూర్తవుతాయో చెప్పాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో మొత్తం రెండు ఫేజ్‌లుగా స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా భక్తులందరికీ సౌకర్యవంతమైన వాతావరణంలో మహా మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రులు స్పష్టం చేశారు.

# రెండో రోజుకు చేరిన జాతీయ సమైక్యత శిబిరం

**వరంగల్ వాయిస్, మామునూరు :** మామునూర్ పోలీస్ శిక్షణ కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ పేరిట 12 రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరం బుధవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్, వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు నింబాల్కర్ క్యాడేట్స్ ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 600 మంది క్యాడేట్స్ ఈ సమైక్య శిబిరంలో పాల్గొన్నారన్నారు. దేశసమైక్యత, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార అలవాట్లు, భాష, సాంఘిక కట్టుబాట్లను ఒకరినుంచి మరొకరు షేర్ చేసుకునే విధంగా, భారతీయులంతా ఒకటే అన్న భావం పెంపొందించడమే జాతీయ సమైక్యత సమైక్య శిబిరం అక్ష్యమన్నారు. ఒకరి సాంప్రదాయాలు మరొకరు గౌరవించడమే ఈ క్యాంపు ఉద్దేశ్యం అన్నారు. ప్రారంభ కార్యక్రమానికి పదో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై అధ్యక్షత వహించగా క్యాంపు శిక్షణ



అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారి, క్యాంపు అడ్జుడెంట్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, ఫస్ట్ ఆఫీసర్ దూడల వెంకటేష్, క్యాంప్ సుబేదార్ మేజర్ జై రామ్ సింగ్, జేసీఓలు కదం, సౌరస్య, సుతార్, సూపరిండెంట్ అరుణ, బీహెచ్ఎం సందీప్, సందీప్ పాటిల్, నిఖిలేష్, కుమారస్వామి, సాజిని, దత్తు సతీష్, మహేష్, సంతోషి, రవి, నిఖిలేష్, దీపక్, రచన, కల్పనా సింగ్, అపురువా, సరిత, కావ్య, గణేష్, అంజి, కమల్ కిషోర్, ట్రైనింగ్ అధికారులు, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్ క్యాడేట్స్ ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంకాలం జరిగిన కార్యక్రమంలో వరంగల్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారని క్యాంపు డిప్యూటీ కమాండెంట్ కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు.

# మరింత గడువు కావాలి

### స్థానిక ఎన్నికలపై హైకోర్టుకు తెలంగాణ?

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైకోర్టు నిర్దేశించిన మూడు నెలల గడువులోపు అంటే ఈ నెలాఖరులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం అసాధ్యంగా కనిపిస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం మరోసారి హైకోర్టులో పిటిషన్ వేసేందుకు సిద్ధమైంది. రిజర్వేషన్ల అంశం ఇంకా తేలనందున మరింత గడువు కావాలని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును కోరే అవకాశాలు ఉన్నాయి. రిజర్వేషన్లపై బిల్లు ఆమోదించామని అది గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉందని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇప్పటికే తెలంగాణలో అన్ని స్థానిక సంస్థల గడువు ముగిసిపోయింది. ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ విషయంలో ముందూ వెనుకాడుతోంది. ఎన్నికలు జరగకపోతే ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశాలు లేనప్పటికీ.. రిజర్వేషన్ల వివాదం కారణంగా ముందుకెళ్లలేకపోతోంది. అధికారికంగా సాధ్యం కాదని.. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ఉందని చెప్పుకున్నారు. అయితే చివరి క్షణంలో మరోసారి బిల్లును ఆమోదించారు. జీవో జారీ చేయాలంటే గవర్నర్ అనుమతి కావాల్సి ఉంటుంది. బీసీ రిజర్వేషన్ల అంశంతో స్థానిక ఎన్నికలను ముడిపెడితే అసలు ఎన్నికలు జరిగే అవకాశాలు ఉండవని నిపుణులు అంటున్నారు. ఎంత ఆలస్యం అయితే ప్రభుత్వానికి అంత ఇబ్బంది అవుతుంది. అయినా ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ముందూ వెనుకాడుతోంది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం దాదాపుగా పూర్తి చేసింది.

# కాకతీయుల నిర్మాణాలు అద్భుతం

◆ భారత కాన్సుల్ ఐఎఫ్ఎస్ బృందం
◆ జిల్లా కలెక్టర్ తో కలిసి కోటగుళ్ల సందర్శన



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల కళా నైపుణ్యం అద్భుతమని భారత విదేశాంగ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ప్రశంసించారు. భారత కాన్సుల్ జనరల్ (సాన్‌ఫ్రాన్సిస్కో) శ్రీకర్ కె.రెడ్డి, ఐఎఫ్ఎస్, బ్రూనై భారత హై కమిషనర్ రాము అబ్బగాని, ఐఎఫ్ఎస్ బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాకతీయుల కళాక్షేత్రమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం, కోటగుళ్లను సందర్శించారు. కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు గణపతి, నందీశ్వర, గణపేశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి యాదగిరి గౌడ్ ఆలయ విశిష్టతను అధికారుల బృందానికి వివరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శివ ద్వారపాలక విగ్రహాలను చూసి వారు ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. పూజల అనంతరం అర్చకులు నాగరాజు అధికారుల బృందాన్ని శాలువాలు, పూలమాలలతో సత్కరించి, ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో ఎల్.భాస్కర్, ఆర్ఐ చెక్క దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### పీహెచ్ సీ, హైస్కూల్‌ను సందర్శించిన బృందం..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జడ్పీ హైస్కూల్‌ను కేంద్ర ప్రభుత్వ రాయబార అధికారుల బృందం బుధవారం సందర్శించింది. ఈ బృందానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నాయకత్వం వహించారు. మొదటగా పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను బృందం పరిశీలించింది. అక్కడి మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఆరు పడకలు ఉన్నాయని, సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి అనూష బృందానికి వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, పీహెచ్‌సీలో పురుష డాక్టర్‌ను నియమించాలని, ఈసీజీ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని, సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే, సిబ్బంది స్థానికంగా ఉంటూ విధులకు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పీహెచ్‌సీ సేవలను గురించి డీఎంహెచ్ఓ మధుసూదన్ కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం, బృందం జడ్పీ హైస్కూల్‌ను సందర్శించింది. పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించి, మధ్యాహ్న భోజన వంటగదిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో పాటు తహసిల్దార్ ఎం సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో ఎల్. భాస్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య బుధవారం కనకదుర్గ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం ఆరుగురు లబ్ధిదారులకు రూ. 3.40 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వేలాది కుటుంబాలకు ఇది అండగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారికి సహాయం అందేలా తాను కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. సీఎం సహాయనిధి అందేలా కృషి చేసినందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





# తుమ్మేటి సమ్మిరెడ్డి ప్రథమ వర్ధంతి

**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధికార ప్రతినిధి తుమ్మేటి సమ్మిరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం జమ్మికుంటలోని వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు పాల్గొని సమ్మిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబాల రాజు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతు సోదరుల గుండెల్లో సమ్మిరెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం, మడిపల్లి ఇందిరమ్మ కమిటీ చైర్మన్ మ్యాకమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదానికి తలొగ్గిన మోడీ

■ పత్తి దిగుమతిపై సుంకం రద్దు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం.) తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం భారత పత్తి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ ఎస్.కె.ఎం. నాయకులు ఖిలా వరంగల్ తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఎస్ కెఎం నాయకుడు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 15న ఎర్రకోట ప్రసంగంలో అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని ప్రకటించి, కేవలం నాలుగు రోజుల తర్వాత పత్తి దిగుమతులపై సుంకం తగ్గించడం ద్వారా ద్వంద్వ నీతిని ప్రదర్శించారని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగి తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గి, దేశంలోని పత్తి రైతులు భారీగా నష్టపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.కె.ఎం. నాయకులు కేంద్ర ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు. పత్తి దిగుమతులపై 11శాతం సుంకం రద్దు చేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి, విదేశీ పత్తిపై 50శాతం సుంకాన్ని విధించాలి. పత్తికి క్వింటాలుకు రూ.10,075 కనీస మద్దతు ధరను అందించాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. రైతులపై ఉన్న అన్ని అప్పులను మాఫీ చేయాలి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 200కు పెంచి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి. ఎరువులపై జీఎస్టీని రద్దు చేసి, దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. యూరియా బస్తాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలి. తుఫానుల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్.కె.ఎం. నాయకులు ఐత నగేష్, మైదం పాణి, బొల్లు ఎల్లయ్య, జన్నారం రాజేందర్, ఎస్. మోహన్, గణపురం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ చైర్మన్ల సమావేశం



**వరంగల్ వాయిస్, పరకాల :** ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ చైర్మన్‌ల ఫోరమ్ అధ్యక్షులు, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం హైదరాబాద్‌లో గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా మార్కెట్ల అభివృద్ధి పనులు, రైతుల సమస్యల గురించి చర్చించారు. మార్కెట్ కమిటీల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్‌లు పాల్గొన్నారు.

# కాశిబుగ్గలో మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని 20వ డివిజన్‌లోని ఆదర్శ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద వంగరి కుటుంబం మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వివేకానంద యోగా సేవా సంస్థ అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సుదర్శన్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయం మాజీ అధ్యక్షుడు వంగరి రవి, ఆదర్శ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాజీ శంకర్, వంగరి రాజశేఖర్, లక్ష్మీపతి, రాజసమయ్య, పిట్టల సంతోష్, పిట్టల కోటి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా సూరం రాము



**వరంగల్ వాయిస్, శాయంపేట :** హనుమకొండ జిల్లా శాయంపేట మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా జడ్పీహెచ్ఎస్ (బాయ్స్) శాయంపేట పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సూరం రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి తెలిపారు. శాయంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్)లో జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలల పీఈటీలు, పీడీలు అందరూ కలిసి ఏకగ్రీవంగా సూరం రామును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గడ్డం భిక్షపతి, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ ఇంఛార్జి ప్రధానోపాధ్యాయురాలు జి.పద్మ, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాసిరి రాజి బాపు రావు, బాయ్స్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సురేష్ కుటుంబానికి ఎమ్మెల్యే నాయిని భరోసా



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 29వ డివిజన్‌కు చెందిన రఘునాథ్ కాలనీలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమైన తెలుకల పెల్లి సురేష్ కుటుంబాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సురేష్ నివాసానికి వెళ్లి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, సురేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. కేవలం సహాయంతోనే ఆగిపోకుండా, ఆ కుటుంబానికి భవిష్యత్తులో స్థిరమైన నివాసం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇస్తూ, సురేష్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, డివిజన్ అధ్యక్షులు పూర్ణ, నాయకులు చెన్నమల్లు, బొమ్మ సురేష్, పద్మ, రఫీ, బాలకృష్ణ, గొర్రె మహేష్, పృథ్వీ, కొట్టె ఆశ శ్రీనివాస్, సతీష్, సుకుమార్, నటేష్, దినేష్, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

# బీజేపీ మండల సన్నాహక సమావేశం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పర్వతగిరి మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయంలో మండల సన్నాహక సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ఇంఛార్జి మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో పార్టీ విజయం కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బలమైన సంస్థను నిర్మించడంపై దృష్టి సారించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార కార్యక్రమాలను ప్రణాళిక చేయడం వంటి ఎన్నికల వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. అధిక ఓటింగ్ శాతం సాధించడానికి బూత్ కమిటీల ద్వారా గ్రామాల్లో బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతం గౌడ్ స్థానిక కార్యకర్తలకు మార్గదర్శకత్వం అందించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు బత్తిని దేవేందర్, జాటోత్ రవి, యువమోర్చా మండల అధ్యక్షుడు గొల్లపెల్లి సంతోష్ కుమార్, వీరస్వామి, నవీన్, నర్సయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయినిని కలిసిన వడ్డెర సంఘం నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వడ్డెర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గండికోట సంపత్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం ఎదుర్కొంటున్న సమస్యలపై వారు చర్చించారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ వడ్డెర సంఘం సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లిపు మల్లికార్జున్, అర్బన్ నగర అధ్యక్షుడు కంది శ్రీనివాస్, కాజీపేట మండల అధ్యక్షుడు కంది రాజు, యూత్ అధ్యక్షుడు పల్లిపు నవీన్, ఐనవోలు మండల అధ్యక్షుడు వల్లెపు నాగరాజు పాల్గొన్నారు.

# రైతులకు తక్షణమే యూరియా అందించాలి

◆ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బుధవారం శాయంపేట మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాదర్పేట స్టేజ్ వద్ద ధర్నా, రాష్ట్ర రోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేస్తున్న కుట్ర మాత్రమే కాకుండా, ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టే ప్రయత్నంలో భాగంగానే కాళేశ్వరాన్ని సీబీఐకి అప్పగించారని పేర్కొన్నారు. ఇప్పటివరకు సీబీఐపై వ్యతిరేకంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజులోనే మాట మార్చారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నందం, కరణ్ బాబు, మోహన్, రాజేందర్, చంద్రమౌళి, సాంబరెడ్డి, రంగు మహేందర్ పాల్గొన్నారు.

# సేవకు మారుపేరు ఎన్ఎస్ఎస్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. (జాతీయ సేవా పథకం) ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్.ఎస్.ఎస్.పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ భుజంగ రావు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఎన్.ఎస్.ఎస్. అనేది గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా 1969, సెప్టెంబర్ 24న భారత ప్రభుత్వ యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో "నా కోసం కాదు, మీ కోసం" అనే నినాదంతో ప్రారంభించబడిందని తెలిపారు. విద్యార్థులకు సమాజం పట్ల పూర్తి అవగాహన కల్పించడం, కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజ సేవ ద్వారా వారి వ్యక్తిత్వాన్ని పెంపొందించడం, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే దీని ప్రధాన లక్ష్యమని అన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాలు, నాటికలు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచామని తెలిపారు. ముఖ్యంగా రక్తదానం, హెచ్ఐవీ, పర్యావరణ పరిరక్షణ, ఓటర్ల చైతన్యం వంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు శ్రమ విలువ, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల అవగాహన లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రోగ్రాం అధికారి ఎస్. సంజీవ, బరపాటు గోపి, అధ్యాపకులు డాక్టర్ ఎస్. అనిత, జి.శ్రీనివాస్, డాక్టర్ వి.శ్రీధర్, వై.చండీశ్వర్, విజ్ఞాన్, స్వప్న తదితరులు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.



# యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని శాయంపేట సీఐ రంజిత్ రావు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలోని ఎస్‌బీఐటీ స్కూల్‌లో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందం సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల కార్మికులు, బాల్య వివాహాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, మూఢ నమ్మకాలు, 4G వంటి అంశాలపై పాటలు, నాటికల ద్వారా ప్రదర్శన ఇచ్చి విద్యార్థులలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట సీఐ రంజిత్ రావు, దామెర ఎస్ఐ కొంక అశోక్, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్ ఆఫీసర్స్, ఎస్‌బీఐటీ ప్రిన్సిపాల్ సమ్మయ్య, జాగృతి కళాబృందం ఇంఛార్జి ఏఎస్ఐ నాగమణి, కళాకారులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, పూల్ సింగ్ తో పాటు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్‌లో అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమాన్ నగర్ లో బుధవారం శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిది రోజులుగా గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అన్న ప్రసాద వితరణ చేపట్టగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సోమసుందర్, దాసి రామప్ప, చింతకింది రాజారాం–శ్రీలక్ష్మి, కె.అశోక్, కంకనాల రాజిరెడ్డి–రమాదేవి, వేణు, డి.శోభన్, విగ్రహదాత కామారపు అశోక్–లావణ్య, కోరుట్ల రఘు – సధ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

■ తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీని తక్షణమే ఎత్తివేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేనేత రంగంపై పన్నులు విధించలేదని, అయితే మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం జీఎస్టీ విధించి చేనేత పరిశ్రమకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ కారణంగా చేనేత రంగం సంక్షోభంలో పడిందని, దీని వల్ల దేశవ్యాప్తంగా నేతన్నలు ఉపాధి కోల్పోయి ఆకలిచావులకు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. జీఎస్టీ కారణంగా నూలు, రంగులు, రసాయనాల ధరలు పెరిగి, చేనేత వస్త్రాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. వస్త్రాల ధరలు పెరగడం వల్ల అమ్మకాలు తగ్గి, చేనేత పరిశ్రమ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద ఉపాధి రంగమైన చేనేతను పాలకులు ఆదుకోవాల్సిన అవసరం ఉందని వెంకట్రాములు అన్నారు. కోట్లాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడంతో పాటు, చేనేత వస్త్రాలు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకు చేనేత రంగాన్ని బలి చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, జరుగుతున్న 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చేనేతపై జీఎస్టీని తొలగించి, చేనేతను కాపాడాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నేతన్నల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



# బీసీ రిజర్వేషన్ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

■ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న బీసీ రిజర్వేషన్ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వందల కోట్లు దోచుకున్న గత పాలకులు పదేళ్లుగా బీసీలను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు పెంచకుండా రాజకీయ పార్టీలు, అగ్రకుల పెద్దలు కుట్రలు చేస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు, అగ్రకులాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లతో న్యాయం జరుగుతోందని, అయితే 60శాతం జనాభా ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి రాజకీయ పార్టీలకు ఏమి సమస్యని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు గల్లీలో మద్దతు ఇస్తున్నట్లు నటించి, ఢిల్లీలో అడ్డుకుంటున్నారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల పట్ల సిండికేట్‌గా మారాయని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిజంగా బీసీ అయితే, పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టడం లేదని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. బీసీలకు, బీసీ మహిళలకు మోడీ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన రిజర్వేషన్ల గుదిబండను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సవరించిందని, అయితే బీసీ రిజర్వేషన్ అంశం తెరపైకి రాగానే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బీసీల కోసం ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి, తమ ఓట్లతో ఇతర పార్టీలను ఓడిస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. సంగాని మల్లేశ్వర్, వరంగల్ శ్రీనివాస్, పాండవుల సురేష్, మాధం పద్మజ దేవి, తమ్మేలా శోభరాణి, మడిశెట్టి అరుంధతి జిల్లా నాయకులు తెల్ల సుగుణ, కిషోర్, డా.రాము, అరుణ బూర్గుల ప్రమోద, మానస తదితరులు పాల్గొన్నారు.

# 'శ్రీకృష్ణ రాయబారం'నాటకం ప్రదర్శన





**వరంగల్ వాయిస్, జనగామ :** అంతరించిపోతున్న జానపద కళలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో మేధావులు ఒక బృందంగా ఏర్పడి 'శ్రీకృష్ణరాయబారం'నాటకాన్ని ప్రదర్శించారు. జనగామలోని మీనాక్షి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నాటకంలో ప్రముఖ పండితుడు అయ్యప్ప శాస్త్రి శ్రీకృష్ణుడి పాత్రలో, ప్రధానోపాధ్యాయులు ఎక్కల దేవి వెంకటేశ్వర్లు కర్ణుడి పాత్రలో, సీనియర్ జర్నలిస్ట్ కొండ శ్రీనివాస్ ధర్మరాజు పాత్రలో నటించి తమ కళా నైపుణ్యాన్ని చాటుకున్నారు. ప్రదర్శన అనంతరం సీనియర్ జర్నలిస్ట్ కొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను బతికించే ఉద్దేశంతోనే ఈ నాటక ప్రదర్శనలు ఇస్తున్నామని తెలిపారు. ఈ కళలను ప్రభుత్వం ఆదుకోవాలని, వాటిని పునరుద్ధరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఆదేశాలు

**వరంగల్ వాయిస్, బల్దియా :** నగరంలో బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ఐయూఏ) సెక్రటరీ నితేష్ అనిరుత ఆదేశించారు. బుధవారం ఢిల్లీ నుంచి ఎన్ఐయూఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐయూఏ సెక్రటరీ మాట్లాడుతూ, నగరంలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటు కోసం సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేయాలని సూచించారు. ప్రాజెక్ట్‌లో భాగంగా సేకరించిన చెత్త పరిమాణాన్ని లెక్కించడం, ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శానిటేషన్ అధికారులతో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సమావేశమయ్యారు. నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఎంహెచ్ఓ డా. రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ గోవిందరాజస్వామి గుట్టపై సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్రకు నిలయమైన వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న గోవిందాద్రి కొండపై స్వయంభుగా వెలసిన శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకుడు గర్నెపెల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పౌర్ణమి రోజున జరిగే ఈ పారాయణం సెప్టెంబర్ 7 ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. వందల మంది భక్తులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గోవిందాద్రి గుట్ట మెట్ల ప్రవేశ ద్వారం వద్ద గోవిందరాజస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి పారాయణానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గోవిందాద్రి గోశాల సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ గ్రూప్ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు వరయోగుల లక్ష్మణ స్వామి, తాడూరి గోపి స్వామి, వరయోగ ప్రసాద్ స్వామి, వరయోగుల నరేష్ స్వామి, మురళి కృష్ణ స్వామితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

# పరకాల ఏడీఏను కలిసిన ఫర్టిలైజర్స్ అసోసియేషన్



**వరంగల్ వాయిస్, పరకాల :** మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు నూతన ఏడీఏ జగదీశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పరకాల ఏడీఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు ఏడీఏ జగదీశ్వర్ రెడ్డిని శాలువా, బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వాడికారి శివాజీ, కోశాధికారి ఎర్రం లక్ష్మణ్ మరియు పరకాల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దాసు రఘురాంకు నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రిటైర్డ్ సబ్–ఇన్‌స్పెక్టర్ దాసు రఘురాం దశదినకర్మ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ వేముల బాలరాజ్ పద్మశాలి, మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పద్మశాలి హాజరై దాసు రఘురాం కుమారుడైన బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ కు మనోధైర్యం కల్పించారు. వీరంతా రఘురాం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. రఘురాం చేసిన సేవలను కొనియాడుతూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమానికి పలువురు పద్మశాలి సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హాజరయ్యారు.

# ఎస్ఆర్ యూనివర్సిటీలో "అంతర్జాతీయ ఉన్నత విద్యా మేళా"




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎస్ఆర్ యూనివర్సిటీలోని ఎస్ ఆర్ఐఎక్స్ ఆడిటోరియంలో "అంతర్జాతీయ ఉన్నత విద్యా మేళా –2025" విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రారంభించారు. యూనివర్సిటీ హబ్, అబాకస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ మేళాకు 2,500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. అమెరికా, యూకే, యూరప్, కెనడా, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి 30కి పైగా ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాలు నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, సిటీ యూనివర్సిటీ ఆఫ్ సియాటిల్, వెబ్‌స్టర్ యూనివర్సిటీ, నయాగరా యూనివర్సిటీ, జావియర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వైకాటో, యూనివర్సిటా కాటోలికా డెల్ సాక్రో కుఓర్, డబ్ల్యూపీఐ, గానన్ యూనివర్సిటీ, రేవెన్స్‌బోర్న్ యూనివర్సిటీ లండన్, ఓఎంఎన్ఈఎస్ ఎడ్యుకేషన్ గ్రూప్ ఇజెన్సియా, ఈఎస్ డీఈఎస్ బిజినెస్ స్కూల్ లు హాజరయ్యాయి. ఈ మేళాలో విద్యార్థులు నేరుగా విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మాట్లాడి, ఉన్నత విద్యా అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు, గ్లోబల్ కెరీర్ మార్గాలపై విలువైన సమాచారం పొందారు. అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, వీసా ప్రక్రియలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఎస్ఆర్ యూనివర్సిటీ అధికారులు మాట్లాడుతూ ఈ మేళా అంతర్జాతీయ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఒక గొప్ప వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.



వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, సెప్టెంబర్ 03, 2025

# గణేష్ మండపాల్లో అన్నదానం




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు గణపతి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలో మాజీ వార్డు కౌన్సిలర్ తేజావత్ సంధ్యా రమేష్ ఆధ్వర్యంలో అలాగే యాదవ్‌నగర్‌లోని కుమ్మరి బజార్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి పాల్గొని ప్రజలకు అన్నప్రసాదాలు పంచారు. అనంతరం స్థానిక మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని సీఐ చంద్రమౌళి నిమజ్జన యాత్రను ప్రారంభించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గణపతిని ప్రార్థించారు. ఈ కార్యక్రమాలలో పవన్, కిషోర్, శంకర్, వెంకటేష్, విట్టల్ లడ్డా, వేణుగోపాల్, రమేష్ లడ్డా, ముల్చంద్ మాల్వానీ, మనోజ్ లడ్డా, మనీష్, సంజయ్, ద్వారక, రమాకాంత్, కృష్ణ లడ్డా, పండర్ లడ్డా తదితరులు పాల్గొన్నారు.

## 20వ డివిజన్‌లో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** నగరంలోని 20వ డివిజన్‌లోని కాశీబుగ్గలో నవజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. గోరంటాల మాధవి, మనోహర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్నదానం ప్రారంభానికి ముందు నన్నపునేని నరేందర్ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గోరంటాల మనోహర్, నవజ్యోతి యూత్ సభ్యులు, డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, మాజీ కార్పొరేటర్ భయ్యా స్వామి, మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్, బాంబుల కుమార్ తదితరులు కలిసి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓని భాస్కర్, టి. రమేష్, బెతి అశోక్, వేముల నాగరాజు, ఉరుగొండ రవి, ఇక్బాల్, పవన్, భిక్షపతి, అజత్ సింగ్, బేతి కృష్ణ, సతీష్, సత్యమూర్తి, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కొత్తవాడలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 22వ డివిజన్ కొత్తవాడ కూరగాయల మార్కెట్ వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహా అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ స్వామి, 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్పొరేటర్లు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్వరాజు కిరణ్, కమిటీ సభ్యులు కంచర్ల శివకుమార్, బాసకర్ల హరికృష్ణ, రాచర్ల భద్రయ్య, కర్రె రవి, గవాస్కర్, బొల్లు సతీష్, పాపడాల రాము, రాకేష్, రాజేష్, శివ, వినయ్, సారంగపాణి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడికి వినతి పత్రం

◆ సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



**వరంగల్ వాయిస్, చిట్యాల :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతకు ప్రభుత్వ అసమర్థతే కారణమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా, నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి కార్యకర్తలు ప్రయత్నించగా, అక్కడే ఉన్న ఎస్సై శ్రావణ్ కుమార్ అడ్డుకుని దిష్టిబొమ్మను తీసుకెళ్లిపోయారు. రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా గణేష్ మండపం వద్ద వినాయకుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ, రాష్ట్రంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సకాలంలో రైతులకు యూరియా అందించకుండా కేవలం కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మేల్కొని రైతులకు సరిపడా యూరియాను అందించాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ పై అక్రమంగా కేసులలో ఇరికించడానికి సీబీఐ విచారణకు ఆదేశించడంపై ఆమె మండిపడ్డారు. ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు మానుకొని రైతులకు సకాలంలో యూరియా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిట్ట సురేష్ బాబు, జంబుల తిరుపతి, లావుడియా శ్రీనువాస్ నాయక్, పేరుమాండ్ల రవీందర్, పుట్టపాక మహేందర్, బుర్ర శ్రీధర్, ఏలేటి రాజు, దామెర రాజు, కాత్రేవుల కుమార్, చిలుముల రమణాచారి, చిదిరాల సరోజన, వీణవంక శ్రీదేవి, మైదం కరుణ, కటకూరి రాజేందర్, బుర్ర రాజు, పులి వెంకట్, బండారి వైకుంఠం, సాద మల్లయ్య, మేడిపల్లి శ్రీనివాస్, తాటిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాయిపేటలో దీపోత్సవం వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దేశాయిపేటలోని కుమ్మరివాడలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా దీపోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మహిళలతో కలిసి సామూహికంగా దీపాలను వెలిగించి, వేడుకల్లో పాల్గొన్నారు. గణేష్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గోకే రాజు, ఉపాధ్యక్షుడు ఉద్దారపు రాంబాబు, కార్యదర్శి ఇట్టినేని రవి, కోశాధికారి సారంగం, అలాగే అనిల్, గోకి రేణుక, సరోజనమ్మ, పద్మ, సుమలత, అనసూర్య, కాంతమ్మ, శారద, అవంతి, నీరజ, శ్రీలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎండీ రియాజ్ ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కుల మతం లేకుండా గణపతి నవరాత్రుల సందర్భంగా అశోక థియేటర్ లో ముస్లిం ఎండీ రియాజ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 5వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పున్నం చందర్, భరత్, పురం కిరణ్, సారయ్య, గాంధీ, నాగరాజ్, కుమార్, లక్ష్మి, కమలమ్మ, భక్తులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ కాలనీలో..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాశీబుగ్గలోని డాక్టర్స్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత యాదవ్ హాజరయ్యారు. ఆమె గణపతికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కాషాట్టి వేణు, సాయి, రమణ, శ్రీను, ఓంకార్, పూర్ణచందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజాసేవను తన ఏజెండాగా భావించే యువ నాయకుడు, స్థానిక బీజేపీ నాయకుడు ఆడెపు వెంకటేష్, వినాయక ఉత్సవాల సందర్భంగా ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం 36వ డివిజన్‌లోని ఆదర్శ నగర్, జీబీ నగర్, పుప్పాలగుట్ట, చంద్రవదన్ కాలనీ, ఏసీ రెడ్డి నగర్, చింతల్ ప్రాంతాల్లోని గణపతి మండపాల వద్ద సుమారు రూ.1 లక్ష విలువ చేసే చీరలను 200 మంది మహిళలకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆడెపు వెంకటేష్ మాట్లాడుతూ నేటి వినాయక ఉత్సవాలలో డీజే శబ్దాలు, ఇతర ఆధునిక పోకడలతో సంస్కృతికి భిన్నంగా వేడుకలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ఆచారాలు, సంప్రదాయాలకు అనుగుణంగా మహిళలందరూ ఒకే వస్త్రధారణతో ఉత్సవాలు జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గణపతి మండపాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉర్సు ప్రతాప్ నగర్‌లో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని, బీదవారి కడుపు నింపే అన్నదాతలకు దేవుని కృప తప్పకుండా కలుగుతుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం ఉర్సు ప్రతాపనగర్‌లోని బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అన్నదానానికి నామని శ్రీలత, రమేష్ గాంధీ దంపతులు భోజనాలను సమకూర్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ, భక్తులు కోరిన కోరికలు నెరవేరడం వల్లే ప్రజలలో భక్తిభావం పెరిగి, ఉత్సవాలు నిర్వహించడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు నిర్వహించి స్వామివారి కృపకు పాత్రులవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మరుపల్ల భాగ్యలక్ష్మి, బాల గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు కుడికాల సాంబశివరావు, గుడిమల్ల రవి, మరుపల్ల ఈశ్వర్ ప్రసాద్, సిరిమల రమేష్, గుడిమల్ల సురేష్, కోరె సాంబమూర్తి, మరుపల్ల శివ, మరుపల్ల గౌతం, సిరిమల్ల సాయికుమార్, చేరాల రమేష్, నామని గోపి, పూర్ణచందర్, చందు, రితేష్, లక్కీ, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ నటించాలని ఉంది

## గోవా బ్యూటీ ఇలియానా



గోవా బ్యూటీ– ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పొకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి... ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు. అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

# వస్తాను.. ఎలా అన్నది చెప్పను

మంత్రి నిమ్మల కూతురు పెళ్లికి ఆహ్వానంపై బాలకృష్ణ



త్వరలో ఏపీలో మంత్రి, పాలకొల్లు శాసన సభ్యుడు నిమ్మల రామనాయుడు కుమార్తె వివాహం జరగనుంది. ఈ క్రమంలో ఆయన నందమూరి బాలకృష్ణను వివాహానికి ఆహ్వానించారు. దీంతో ఆయన ఆసక్తికరంగా స్పందించారు. వస్తానని ఎలా వస్తానో చెప్పనని తెలిపారు. ఈ విషయాన్ని రామానాయుడు సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ఈ మేరకు బాలకృష్ణను ఆహ్వానిస్తున్న వీడియో సైతం షేర్ చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణ గారు ను కలిసి పాలకొల్లులో ఈనెల 24వ తేదీన జరగబోయే నా కుమార్తె శ్రీజ వివాహ శుభలేఖ అందజేసి రమ్మని ఆహ్వానించగా వస్తానని ఎలా వస్తానో చెప్పనని తెలిపారు. మరియు ప్రముఖ చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను గారు ను కూడా రమ్మని ఆహ్వానించడం జరిగింది అని రామానాయుడు పేర్కొన్నారు.




# గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో.

బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'నిశాంఛి' జార్ పిక్చర్స్ బ్యానర్‌పై అజయ్ రాయ్, రంజన్ సింగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఆయిశ్వర్య్ థాకరే హీరోగా బాలీవుడ్‌కి పరిచయం అవుతుండగా, వేదిక పింటో, మోనికా పన్వార్, మహమ్మద్ జీషన్ అయ్యూబ్ , కుముద్ మిశ్రా కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి –ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రాబోతున్న ఈ సినిమా –ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.




# సుదీప్.. మార్క్

## సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల


కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటిస్తున్న 47వ చిత్రానికి 'మార్క్' టైటిల్ ఖరారు చేశారు. సినిమా –టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'మార్క్' చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సెంథిల్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు విజయ్ కార్తికేయా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మార్క్' సినిమా ఈ క్రిస్మస్ పండగకు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.మార్క్' సినిమా –టైటిల్ గ్లింప్స్ పవర్ ఫుల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. మ్యాడ్, ఆటిట్యూడ్, రూత్ లెస్, కింగ్... అంటూ మార్క్ పేరులోని అక్షరాలకు డెఫనేషన్ ఇచ్చారు. ఈ గ్లింప్స్ లో అజయ్ మార్కండేయ పాత్రలో కిచ్చా సుదీప్ ను ఇం–టె–న్స్ లుక్ లో పరిచయం చేశారు. ఆయన క్యారెక్టర్ పేరుతోనే –టైటిల్ 'మార్క్' ఉండబోతోంది. ఈ గ్లింప్స్ కు అజనీష్ లోకనాథ్ అందించిన బీజీఎం ఆకర్షణగా నిలుస్తోంది. కిచ్చా సుదీప్ కెరీర్ లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్ –టైనర్ గా రూపొందుతున్న 'మార్క్' సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.



# ప్రపంచానికి కెన్యా ప్రకృతి దృశ్యాలు

## రాజమౌళి సినిమాపై ఆ దేశ మంత్రి వ్యాఖ్య

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబి29' (వర్కింగ్ –టైటిల్). భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అదే స్థాయిలో విడుదల చేసేందుకు రాజమౌళి ప్లాన్ చేశారు. కెన్యాలో షూటింగ్ చేస్తున్న సందర్భంగా.. ఆ దేశ మంత్రి ముసాలియా ముదావాదిని మూవీ టీమ్ మర్యాదపూర్వకంగా కలిసింది. భేటీ అనంతరం ముఖ్యాంశాలను సోషల్ మీడియాలో అక్కడి మంత్రి పోస్టు చేశారు. రెండు దశాబ్దాలుగా రాజమౌళి సినీ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. చాలా శక్తిమంతమైన కథనాలను, విజువల్స్‌ను, లోతైన సాంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారు. తూర్పు ఆఫ్రికా అంతటా పర్యటించిన అనంతరం 120 మందితో కూడిన రాజమౌళి టీమ్ కెన్యాను ఎంచుకుంది. మసాయి మరా మైదానాల నుంచి మొదలు సుందరమైన నైవాషా, ఐకానిక్ అంబోసెలి వంటి ప్రాంతాలు ఆసియాలోనే అతిపెద్ద చలనచిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో భాగం కాబోతున్నాయి. 120 దేశాల్లో ఈ మూవీని విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికిపైనే చేరువయ్యే అవకాశం ఉంది. కెన్యాలో షూటింగ్ చేయడం ఒకమైలురాయిగా నిలిచిపోతుంది. ప్రపంచ వేదికపై మా దేశ అందాలను, ఆతిథ్యాన్ని, సుందర దృశ్యాలను చూపడంలో ఈ సినిమా శక్తిమంతంగా పనిచేయనుంది. ఎస్ఎస్ఎంబీ 29 చిత్రంతో కెన్యా తన చరిత్రను ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. ఈ విషయంలో గర్వంగా ఉంది అని ముసాలియా ముదావాది పేర్కొన్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు–, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నట్లు– ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంతో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.



# తెలంగాణ అమరుల ఆత్మ ఘోషే.. కవిత తిరుగుబాటు

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నేతలపై హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డారు. 1,200 మంది తెలంగాణ విద్యార్థుల ఆత్మలు కవిత రూపంలో మాట్లాడాయి అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో నిజాలు మాట్లాడని నేతలే చాలామంది ఉన్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న సొమ్ము పంపకాలలో వచ్చిన పంచాయతే కవిత ఎపిసోడ్ అన్నారు. పదేళ్ల క్రితం మీ ఆస్తులు ఎంత? ఇప్పుడు మీ ఆస్తులు ఎంత? అంటూ నిలదీశారు. బీఆర్ఎస్ నేతల ఆస్తుల పెరుగుదలను ఆయన ఎత్తి చూపారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు మీ హయాంలో కట్టింది వాస్తవమే, కానీ కూలింది కూడా వాస్తవమే కదా అంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన అధికారుల ఇళ్లలో సోదాలు చేస్తే పెద్ద మొత్తంలో నోట్ల కట్టలు దొరికాయన్నారు. ఇది వాస్తవం కాదా? అంటూ నిలదీశారు. ట్రిబుల్ షూటర్ హరీష్ రావు నాయకత్వంలో ప్రజల ఆస్తులను ట్రబుల్‌లో పెట్టారన్నారు. కవిత తనపై వచ్చిన ఆరోపణలలో వాస్తవం ఉందని భావిస్తే, సీబీఐ విచారణకు సాక్ష్యంగా ఉండాలన్నారు.

కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి వాదిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి ఉన్న నాయకుడని గుర్తు చేశారు. బినామీల పేర్లతో లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు చేసిన ఘనతకు ర్యాలీలు, ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ కోసం మాట్లాడుతున్న రేవంత్ రెడ్డిని చంద్రబాబు శిష్యుడని అంటున్నారు.. గతంలో హనుమంత్ రావు నాయకత్వంలో పనిచేసిన కేసీఆర్ ఎవరి శిష్యుడని ప్రశ్నించారు. బంగారు తెలంగాణ పేరుతో మీ ఇల్లు బంగారం చేసుకుని ప్రజల ఆస్తులను, అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది మీరే అంటూ ప్రకటించారు. మీ వ్యక్తిగత కుటుంబ విషయాలతో మాకు జోక్యం లేదన్నారు. అయితే మీరు కలిసి దోచిన ప్రతి రూపాయిని తెలంగాణ ప్రజలకు పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయిని రాజేందర్ రెడ్డితో పాటు కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, పులి అనిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, మైనారిటీ అధ్యక్షులు అజీజ్, లీగల్ సెల్ రాజ్ కుమార్, నాయకులు అంబేద్కర్ రాజు, బంక సంపత్, నాయిని లక్ష్మా రెడ్డి, పులి రాజు, మోహన్ రెడ్డి, నసీం జా, రహీమున్నీసా, శ్వేత, డివిజన్ అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# ఫార్మసీ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలి

☐ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** 104 సర్వీస్ లో పని చేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లను రెగ్యూలర్ చేయాలని స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లో 104 ఫార్మసీ ఆఫీసర్స్ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. 104 సర్వీస్ లో పని చేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ కు కంటిన్యూయేషన్ ఇచ్చి పెండింగ్ లో ఉన్న ఐదు నెలలు వేతనాలు వెంటనే చెల్లించాలని, గత 17 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ సేవలను గుర్తించి వెంటనే రెగ్యూలర్ చేయాలని కోరారు. లేకుంటే 300 ఓసీఎస్ కింద నియమించాలన్నారు. పై సమస్య పరిష్కారానికి రాష్ట్ర ఉన్నతాధి కారులు, హెల్త్ మినిస్టర్ ను కలిసి పరిష్కారానికి కృషి చేస్తామని సెంట్రల్ కమిటీ ద్వారా హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, యాదాద్రి జిల్లా గాదె శ్రీనివాస్, ములుగు వైకుంఠం, సిద్ధిపేట నారాయణ, ఖమ్మం మన్మధ రావు, కరీంనగర్ హేమలత, హనుమకొండ ప్రభావతి, సరళ రాణి, కొత్తగూడెం రవి కుమార్, సుధా, మహబూబాబాద్ జ్యోతి, రవీందర్, వరంగల్ ధర్మరాజు, రంగా రావు, సృజన, సుధా రాణి, ములుగు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలను త్వరగా పూర్తి చేయాలి

◆ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
◆ మోడల్ స్కూల్ అభివృద్ధి పనుల క్షేత్రస్థాయి పరిశీలన



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ములుకనూరులోని మోడల్ స్కూల్ సమీపంలో గ్రామంలోని మురుగు కాలువల ద్వారా వచ్చే మురుగునీరు, వర్షపు నీరు నిల్వ కారణంగా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని మోడల్ స్కూల్ సమీపంలో ఇటీవల మంజూరైన ఇంకుడు గుంతలను నిర్మించనున్న స్థలాన్ని, మోడల్ స్కూల్లో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను, పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లను, అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ సమీపంలో గ్రామంలో నుండి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించగా వారి ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి పనులను మంజూరు చేయగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అక్షయపాత్ర నుండి వస్తున్న భోజనం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారాం, డీఈ శిరీష, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 5 న జీపీఓలకు నియామకపత్రాలు

జీపీఓ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు సీసీఎల్ఏ లోకేష్ కుమార్ వెల్లడించారు. జీపీఓ అభ్యర్థులకు నియామక పత్రాలు హైదరాబాద్ లో అందజేయనున్న సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. జిల్లా నుంచి జీపీఓ పరీక్ష రాసి 107 మంది ఉత్తీర్ణత సాధించారని కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. అభ్యర్థులను ఈ నెల 5 వ తేదీన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిను నోడల్ ఆఫీసర్ గా నియమించామని తెలిపారు. హైదరాబాద్ తరలివెళ్లే అభ్యర్థులకు కావల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ఏఓ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** పశుసంవర్ధక శాఖలో నాన్-గెజిటెడ్ వెటర్నరీ క్యాడర్‌లో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. బుధవారం హైదరాబాద్‌లోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర సంచాలకులు డాక్టర్ బి.గోపి ఆధ్వర్యంలో ఈ పదోన్నతులను అత్యంత పారదర్శకంగా వెబ్ కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఆఫీస్ సబార్డినేట్ (ఓఎస్) నుంచి వెటర్నరీ అసిస్టెంట్ (వీఏ)గా, వెటర్నరీ అసిస్టెంట్ (వీఏ) నుంచి లైవ్ స్టాక్ అసిస్టెంట్ (ఎల్ఎస్ఏ)గా, లైవ్ స్టాక్ అసిస్టెంట్ (ఎల్ఎస్ఏ) నుంచి జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ (జేవీఓ)గా, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ (జేవీఓ) నుంచి వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ (వీఎల్ఓ) గా పదోన్నతులు కల్పించారు. ఈ పదోన్నతుల కోసం గత నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమస్యను పరిష్కరించారు. పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి గోష్ సహకారంతో సుమారు 600 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ సందర్భంగా తెలంగాణ నాన్-గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్, కార్యదర్శి పి.అభిషేక్, సహా అధ్యక్షుడు రతన్, కోశాధికారి సుధాకర్, హనుమకొండ అధ్యక్షుడు లక్ష్మణ్, చిరంజీవి తదితరులు మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి గోష్, సంచాలకులు డా. బి.గోపిలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# నానో యూరియా వాడండి, భూసారాన్ని కాపాడండి

☐ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** ఉద్యాన పంటల్లో నానో యూరియా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం గీసుగొండ మండలంలో డ్రోన్ ద్వారా తిమ్మాపురం శ్రీకాంత్ వంకాయ తోటలో నానో యూరియా పచికారీ చేయించడం జరిగింది. క్షేత్ర ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు ఉద్యాన పంటల్లో నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. . కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఉద్యాన అధికారి తిరుపతి, ఎంఈఓ హరిప్రసాద్, హెచ్ఈఓ వేణు, ఏఈఓ రజని, కావ్య తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com